# ఇందువు

జ్యోతిష్యశాస్త్రము ప్రకారము జ్ఞానమునకు అధిపతి నవగ్రహములలో చంద్రుడు. భూమి మీద మానవునకు కర్మరీత్య సమస్తమును సమకూర్చి పెట్టునవి నవగ్రహములేనని తెలియాలి. మానవునకు క్రొత్త జ్ఞానమును సంపాదించిపెట్టడములో చంద్రునకు అధికారము లేకపోయినప్పటికీ, పోయిన జన్మలో ఎంత జ్ఞానము ఉన్నదో అంతే జ్ఞానము మరుజన్మకు కూడ అందించు బాధ్యత చంద్రునకు ఉన్నది. మానవునకు జ్ఞానమునందించు అధికారము చంద్రునికి మాత్రము కలదు. కావున జ్యోతిష్యశాస్త్రములో జ్ఞానమునకు అధిపతిగ చంద్రుడు నిలిచాడు. కంటి చూపుకూ, నీటికీ, ఆకాశమునకూ మొదలగు ఎన్నిటికో ఆధిపత్యము వహిస్తూ, మానవునకు కర్మరీత్య వాటిని అందించుచున్నప్పటికీ చంద్రునికి ప్రత్యేకమైన పేరు రాలేదు. కాని ఒకే ఒక జ్ఞానమునకు అధిపతియైనందు వల్ల **ఇందువు** అను ప్రత్యేకమైన పేరు కలిగినది. దీనిని బట్టి ఆకాశములో ఇందువు చంద్రుడని అందరూ గ్రహించవలెను.

యోగశాస్త్రమైన గీతలో దైవము మొక్క విశ్వరూపమును గూర్చి తెలుపునపుడు సూర్య ప్రకాశమును పోల్చి చెప్పారు. అట్లే దైవము యొక్క జ్ఞానమును గూర్చి చెప్పునపుడు చంద్ర ప్రకాశమును గూర్చి చెప్పారు. అంటే దైవమును సూర్యునిగ, దైవజ్ఞానమును చంద్రునిగ పోల్చి చెప్పడమైనది. అలా పోల్చడమునకు కారణము కలదు. సూర్యుడు స్వయం ప్రకాశకుడు. సూర్యుడు స్వయంగా మండుచున్న అగ్ని గోళము. చంద్రుడు స్వయం ప్రకాశము లేనివాడు, సూర్యకిరణము చంద్రుని మీద పడినపుడు మాత్రమే ప్రకాశింపగలడు. సూర్య కిరణము ఎంత ప్రదేశముపడితే అంత ప్రదేశమే ప్రకాశవంతంగా చంద్రుడు కన్పించును. ఇటువంటి ఏర్పాట్లు నవగ్రహములలో మరి ఏ ఇతర గ్రహములకు లేవు. సూర్యునికి ఎంత ఎదురుగపోతే అన్ని కిరణములు చంద్రుని మీద పడి చంద్రుడు ప్రకాశింపగలడు. సూర్యునికీ, చంద్రునికీ మధ్యలో భూమి కలదు. చంద్రుడు భూమి వెనుక వచ్చినపుడు సూర్యకిరణములు చంద్రుని మీద పడక చంద్రుడు ప్రకాశింపడు. చంద్రుడు భూమి నీడను వదలి ఎంత ప్రక్కకు వస్తే అంత ప్రకాశిస్తాడు. ఇది ప్రతి నెలలోను అమావాస్య, పౌర్ణమి రూపములలో చూస్తూనే ఉన్నాము. దైవసమానము సూర్యుడైతే, జ్ఞానము తెలుసుకొన్న మానవుడు చంద్రునితో సమానము. ఇక భూమి ఇటు దైవమునకు, అటు మానవునకు మధ్యలో ఉన్న మాయతో సమానమని తెలియునట్లు ప్రత్యక్షముగ అమావాస్య, పౌర్ణమి రూపములో ప్రపంచ నిర్మాణలు నిర్మితము జరిగినది.

సూర్యుడు ఎల్లపుడు ప్రకాశిస్తూనే ఉన్నాడు. అట్లే దైవము ఎల్లపుడూ గలదు. చంద్రుడు మధ్యలో అడ్డుగ గల భూమి నీడను వదలి పోయే కొద్దీ ప్రక్కకు పోయిన ఆ కొద్ది భాగము సూర్యకాంతిచే ప్రకాశిస్తున్నాడు. అట్లే మానవుడు మాయను వదలి ఏ కొద్దిగ దైవము మీద శ్రద్ధ కలిగినా ఆ శ్రద్ధయంతయే జ్ఞానము కల్గును. భూమినీడను వదలి పూర్తి ప్రక్కకు వచ్చు చంద్రబింబము పూర్తిగా ప్రకాశిస్తూ పౌర్ణమి అవుచున్నది. అట్లే ఎవడైతే పూర్తి మాయ ప్రభావమును వదలి, దైవము మీద శ్రద్ధ కలిగి ఉన్నాడో వాడు సంపూర్ణ జ్ఞానిగ లెక్కింపబడుచున్నాడు. చంద్రబింబము ఎంత భూమి నీడకు పోవుచున్నదో, అంత చీకటి దానియందు ఏర్పడుచున్నది. పూర్తి భూమి చాటుకు పోతే, చంద్రుడు పూర్తి చీకటైపోయి అమావాస్యగా మారి ఉన్నా లేనట్లే అగును. అట్లే మానవుడు మాయ ప్రభావమయిన గుణములవైపు పోవుకొలది వానియందు అజ్ఞానము చోటు చేసుకొనును. పూర్తి మాయ వైపు పోవువాడు పూర్తి అజ్ఞానిగ మారిపోయి ఉన్నా లేనట్లే అగును. ప్రత్యక్షముగ

విషయముగ అర్థమగునట్లు, మొదట దైవము, తర్వాత అజ్ఞానము, ఆ తర్వాత జ్ఞానముగ, మొదట సూర్యున్ని, మధ్యలో భూమిని తర్వాత చంద్రున్ని ఉంచడము జరిగినది.

ఇట్లుండగ కొందరు బాహ్య సూర్యునికి మ్రొక్కుచున్నారు. బాహ్య చంద్రుణ్ణి పొగడుచున్నారు, గానీ జ్ఞానము తెలుసుకోలేక పోవుచున్నారు. దైవమును అనుసరించలేక పోవుచున్నారు. కొందరు దైవము యొక్క విలువ తెలిసినవారై, అట్లే మాయ యొక్క బంధనాన్ని కూడ గుర్తించిన వారై, దైవము మీద శ్రద్ధ పెంచుకొని దైవజ్ఞానమును పొందుచున్నారు. ప్రపంచములో అట్టివారు ఎచట ఉన్నా వారిని జ్ఞానులు అంటాము. దైవత్వమును గూర్చి తెలిసినవాడు ఎవడైన జ్ఞానియే. దైవత్వమనునది ఒకటున్నదనీ, దాని మీద భక్తి కలిగి, దాని మీద శ్రద్ధ కలిగి జ్ఞానము పొందినవాడు అమెరికా క్రైస్తవుడు గానీ, గల్ఫ్ ముస్లీమ్ గానీ, చైనా భౌద్ధుడు గానీ మరియే ఇతర దేశస్థుడుగానీ జ్ఞానియే అనబడును.

దైవజ్ఞానము పొందిన వానిని జ్ఞాని అంటున్నాము కదా! అట్టి వానిని బ్రహ్మ విద్యా విధానమున “ఇందువు” అని కూడ అనుచున్నాము. దైవజ్ఞానము పొందిన ఎవడైన ఆకాశములో సూర్యకిరణములు పొందిన చంద్రునితో సమానము. కనుక చంద్రుని పేరైన “ఇందువు” అను పదమును జ్ఞానికి ఉపయోగించు చున్నాము. చంద్రుని పేరును జ్ఞాని ఎడల గీతయందు కూడ ఉపయోగించుచు ***‘తత్ర చాంద్ర మసం జ్యోతిర్యోగీ ప్రాప్యని వర్తతే’*** అని అక్షర పరబ్రహ్మ యోగమున 25వ శ్లోకములో కూడ అనడము జరిగినది. పూర్వ జన్మమున యోగియైనవాడు మోక్షము పొందనపుడు తిరిగి చంద్ర తేజమును పొంది పునర్జన్మ (పునరుద్భవము) పొందునని భగవంతుడు చెప్పిన మాట గీతయందు గలదు. చంద్ర తేజము ఆకాశములో వెన్నెల రూపమున, మానవునిలో జ్ఞానరూపమున ఉండునని తెలియుచున్నది. అందువలననే దైవజ్ఞానము పొందిన వానిని ఇందువు అంటున్నాము.

సూర్యుడు, చంద్రుడు, భూమి వరుసగ దైవము, జ్ఞానము, మాయలుగ అర్థమగునట్లు సృష్టించిన దేవుడు మానవున్ని జ్ఞానిగా మారుటకు తగునన్ని సూచనలిచ్చాడు. అయినప్పటికీ మానవులందరు ఆ విధానమును తెలుసుకోలేక పోయినప్పటికీ, భూమి మీద కొందరు మాత్రము దైవసూత్రమును గ్రహించ గల్గినారు. ఎన్నో దేశములుగ విభజింపబడి ఉన్న ఈ భూగోళములో భారత దేశములో మాత్రమే దైవసూత్రములు తెలిసి, జ్ఞానమును పొందినవారు ఎక్కువగ పూర్వముండెడివారు. పూర్వకాలమున ఒకే ఒక భారత దేశమున జ్ఞానము పొందినవారున్నారనీ, దైవమునకు భారత దేశము కేంద్రములాంటిదనీ, ప్రపంచ దేశములన్నిటికి కూడ తెలుసును. భారతదేశము జ్ఞానులకు నిలయమైన దేశము కావున, జ్ఞానకేంద్రమైన దేశము కావున, భారతదేశమును పూర్వము ఇతర దేశముల వారందరు “ఇందూదేశము” అనెడివారు.

జ్ఞానము పొందిన వానిని చంద్రునితో సమానముగ, ఇందువు అనుట బ్రహ్మవిద్యయందు గలదు. కావున జ్ఞానుల దేశమైన భారత దేశము ఇందువుల దేశముగ పిలువబడెడిది. భారత దేశమునకు ఈ విధముగ పూర్వకాలమేనాడో జ్ఞాన సంబంధమున ఏర్పడిన పేరుయే ఇందూదేశము.

అచ్చు ‘ఇ’ తో మొదలైన ఇందూదేశము ఈనాడు హల్లు ‘హి’ తో ప్రారంభమై హిందూదేశముగ పిలువబడుచున్నది. ఆనాడు జ్ఞాన సంబంధమైన ఆకాశ చంద్రునికి మారుపేరైన ఇందూదేశము నేడు భూమి మీద నదికి మారుపేరైన సింధూదేశముగా అదియే హిందూదేశముగా చెప్పుకొనుచున్నాము. హిందూదేశమను

పేరు ఎట్లు వచ్చినదీ కొంతమంది పరిశీలకులకు అర్థముకాక, భూమి మీద ప్రవహించు నదులలో, సింధూనది అను పేరుగల నది ఒకటి ఉందనీ, ఆ సింధూనది ప్రవహించుట వలన సింధూ దేశమనీ, అదియే హిందూ దేశముగ మారి ఉంటుందని సరిపుచ్చు కొన్నారు. ఎంతో జ్ఞానచరిత్ర కల్గి, ఎందరో బ్రహ్మర్షులు ఉద్భవించిన, జ్ఞాన నిలయదేశమైన దానివలన ఇది ఇందూ దేశముగ పూర్వముండెడిదని తెలియలేక పోయారు. కాల గర్భమున హిందువుగ మారినవాడు జ్ఞానముకల్గి తిరిగి ఇందువుగ మారవలెనని, ఇది హిందూదేశము కాదు, నిజానికి ఇందూదేశమని నిరూపించాలని అందరిని కోరుకుంటున్నాము. సింధూనది పాకిస్థాన్‌లో గలదు. పాకిస్థాన్‌లోనే సింధూరాష్ట్రమని సింధూనది పేరుతో ఒక రాష్ట్రము కూడా గలదు. పాకిస్థాన్‌లో గల సింధూ పేరును మన దేశమునకు పెట్టుకోవడమేమిటని యోచించాలి. ఆంగ్లేయులే ఇండియా అని మన దేశమునన్నారు, హిండియా అని అనలేదు. అందువలన మనము ఇందువులమేనని తెలియాలి.

ఇందూ ధర్మప్రదాత,

సంచలనాత్మక రచయిత, త్రైతసిద్ధాంత ఆదికర్త

**శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు**